సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



చీనీ టన్ను రూ.35 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 586 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.13
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
42.5°/24.6°

జిల్లావ్యాప్తంగా సోమవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. గంటకు 6 నుంచి 19 కిలో మీటర్ల వేగంతో వడగాల్పులు వీచాయి.

న్యూస్‌రీల్

పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు
పుట్టపర్తి అర్బన్: ఎన్నికల పోలింగ్ రోజైన మే 13వ తేదీన వివిధ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ సూర్యనారాయణ ఆయా సంస్థల యాజమాన్యాలను ఆదేశించారు. సోమవారం ఆయన పుట్టపర్తిలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని వివిధ వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, ఇతర సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు వెల్లడించారు. ఇక జిల్లాలో పనిచేస్తున్న సరిహద్దు రాష్ట్రాల కార్మికులకూ ఇదే నిబంధన వర్తిస్తుందన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగే రోజున వారికి కూడా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఆదేశించారు.

ఏపీపీఎస్సీ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా డాక్టర్ సుధాకర్‌రెడ్డి



జీవీ సుధాకర్‌రెడ్డి

కదిరి: ఏపీపీఎస్సీ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా కదిరికి చెందిన డాక్టర్ జీవీ సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు(జీఓ ఆర్‌టీ నెం.751)జారీ చేశారు. ఏపీపీఎస్సీ ప్రస్తుత చైర్మన్ డి.గౌతమ్ సవాంగ్ ఈ నెల 18 నుంచి మే 9వ తేదీ వరకూ 22 రోజులు పాటు వ్యక్తిగత పని మీద అమెరికా వెళ్లేందుకు అనుమతి కోరగా, ప్రభుత్వం అంగీకరించింది. ఈ నేపథ్యంలో సవాంగ్ స్థానంలో ఏపీపీఎస్సీ సభ్యుడిగా ఉన్న డాక్టర్ జీవీ సుధాకర్‌రెడ్డిని ఇన్‌చార్జ్ చైర్మన్‌గా నియమించింది.

26 వరకూ పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం
పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం ఈనెల 26వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ అరుణ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు ఎక్కడ ఉన్నా, తాము పని చేసే చోటే ఫారం-12ను సమర్పించే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పని చేసే చోటు నుంచే ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఎన్నికల విధులకు హాజరయ్యే పీఓలు, ఏపీఓలు శిక్షణ సమయంలోనే ఫారం-12ను తీసుకోవాలన్నారు. ఆర్టీసీ సిబ్బంది ఫారం-12ను ఆశాఖ జిల్లా నోడల్ ఆఫీసర్‌కు సమర్పించాలన్నారు. అలాగే ఎన్నికల విధుల్లో పాల్గొనే వీడియో గ్రాఫర్లు, డ్రైవర్లు, క్లీనర్లు ఇతర సిబ్బంది ఫారం-12ను ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని సూచించారు.

క్వింటా చింతపండు రూ.24,500



హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా చింతపండు గరిష్టంగా రూ.24,500 పలికింది. మార్కెట్‌కు సోమవారం 2 వేల క్వింటాళ్ల సరుకు రాగా, ఈ-నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.24,500, కనిష్టంగా రూ.8,100, సగటున రూ.12 వేల ప్రకారం పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.9 వేలు, కనిష్టంగా రూ.4,100, సగటున రూ.6 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు ఆయన వెల్లడించారు. ఇక బోటు రకం క్వింటా గరిష్టంగా రూ.3 వేలు, కనిష్టంగా రూ.2,500, సగటున రూ.3 వేల ప్రకారం పలికినట్లు వెల్లడించారు.

తనిఖీలపై 'నిఘా నేత్రం'



వాహనానికి అమర్చిన సీసీ కెమెరా

చిలమత్తూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తనిఖీలపై ఎన్నికల కమిషన్ దృష్టి కేంద్రీకరించింది. అధికార యంత్రాంగం ఎలా పనిచేస్తోందో పరిశీలించేందుకు నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. తనిఖీల కోసం నియమించిన బృందాలు ప్రయాణించే వాహనానికి సీసీ కెమెరా అమర్చింది. దీంతో తనిఖీ చేసే సమయంలో ప్రతిదీ అందులో రికార్డు అవుతోంది. దీంతో ప్రత్యేక బృందాలు మరింత నిబద్ధతతో పనిచేస్తున్నాయి.

భళా.. బాలికా

- పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటిన బాలికలు
- బాలికలు 88.37, బాలురు 80.87 శాతం ఉత్తీర్ణత
- మెరిసిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- రాష్ట్రంలో జిల్లాకు 20వ స్థానం



పుట్టపర్తి: పదో తరగతి ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. బాలురను వెనక్కునెట్టి 88.37 శాతం ఉత్తీర్ణతతో దూసుకువెళ్లారు. మొత్తంగా చూస్తే జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే మెరుగైన మార్కులతో మెరిశారు. మెరుగైన బోధన, 'నాడు-నేడు'తో అందుబాటులోకి వచ్చిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ప్రైవేటుకు దీటుగా మార్కులు సాధించారు.

ఈసారి ముందే ఫలితాలు..
విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఫలితాలు సోమవారం విజయవాడలో పదో తరగతి ఫలితాలు విడుదల చేశారు. అనంతరం అధికారిక వెబ్‌సైట్లో ఉంచారు. కమిషనర్ ప్రకటన కోసం ఎదురు చూసిన విద్యార్థులు, తల్లిదండ్రులు, బంధువులు, ఉపాధ్యాయులు ఆ వెంటనే మొబైల్ ఫోన్లు, నెట్ సెంటర్లకు వెళ్లి వివిధ వెబ్‌సైట్లలో తమ పిల్లలు మార్కులను చూసుకున్నారు. కాగా ఎప్పుడూ లేని విధంగా ఈసారి చాలాముందుగా ఫలితాలు విడుదల చేశారు. ఏటా మేలో ఫలితాలు విడుదల అవుతుండగా ఈసారి ఇంకా విద్యా సంవత్సరం ముగియకనే ఫలితాలు విడుదల చేయడం విశేషం.

జిల్లాకు 20వ స్థానం..
మార్చి 18 నుంచి 31వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు నిర్వహించగా, జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 27,555 మంది విద్యార్థులు హాజరయ్యారు. సోమవారం ఫలితాలు విడుదల కాగా, జిల్లా 84.46 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 20వ స్థానంలో నిలిచింది. 21,809 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయగా, 18,419 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలికలు 9,213 మంది (88.37 శాతం), బాలురు 9,206 మంది (80.87 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

30లోగా ఫీజు చెల్లించాలి
ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఈనెల 30లోగా ఫీజు చెల్లించాలని అధికారులు సూచించారు. మూడుకంటే ఎక్కువ సబ్జెక్టుల పైన రూ. 125, మూడు లోపు సబ్జెక్టులకు రూ. 110, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతో పాటు అదనంగా రూ. 60 చెల్లించాలని సూచించారు. రీకౌంటింగ్‌కు రూ. 500, రీ వెరిఫికేషన్ ద్వారా జవాబుపత్రం నకలు కావాల్సిన వారు రూ. 1000 చొప్పున ఈనెల 30వ తేదీలోపు సంబంధిత పాఠశాల హెచ్‌ఎం లాగిన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.

51 మందికి 590పైగా మార్కులు..
జిల్లాలో 430 ప్రభుత్వ పాఠశాలలుండగా, అందులో 25 ప్రభుత్వ పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించాయని డీఈఓ మీనాక్షి తెలిపారు. 51 మంది విద్యార్థులు 590పైగా మార్కులు సాధించారన్నారు. గుడిబండ మహాత్మాజ్యోతిభాపూలే పాఠశాల విద్యార్థిని గోపిక 596 మార్కులు, కొడిగినహళ్లి గురుకుల పాఠశాలకు చెందిన మహేశ్ 596 మార్కులు సాధించి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచారు. అలాగే కొడిగినహళ్లి గురుకుల పాఠశాలకు చెందిన యశ్వంత్ 593, ధర్మవరం బీఎస్‌ఆర్ మున్సిపల్ పాఠశాల విద్యార్థి గిర్రాజు సాగర్ 593, కొత్తచెరువు చెన్నరాజులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సరిత 591 మార్కులు సాధించారు.

కేజీబీవీ ఉత్తమ ఫలితాలు..
జిల్లాలో కస్తూర్బా పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించాయి. జిల్లాలో 30 గురుకులాలు ఉండగా, నల్లచెరువు, ముదిగుబ్బ, గాండ్లపెండ, పరిగి, తనకల్లు, రొద్దం పాఠశాలలు వంద శాతం ఫలితాల్లో సత్తా చాటాయి. ఆయా పాఠశాలల నుంచి 1,146 మంది బాలికలు పరీక్షలు రాయగా 1,049 మంది (91 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

టాప్ లేపిన జ్యోతిబా పూలే విద్యార్థులు..
మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. జిల్లాలో 10 స్కూళ్లు ఉండగా, 714 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 696 మంది (98.88 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బుక్కపట్నం, నసనకోట, గుడిబండ, పేరూరు పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించడం గమనార్హం.



596 మార్కులు సాధించిన మహేష్‌బాబు



593 మార్కులు సాధించిన యశ్వంత్



593 మార్కులు సాధించిన గిర్రాజు సాగర్



591 మార్కులు సాధించిన సరిత

స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట బందోబస్తు



పెనుకొండలో స్ట్రాంగ్ రూంల వివరాలను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్/పెనుకొండ: ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం రాత్రి ఆయన పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం వెనుక ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. బందోబస్తు, సీసీ కెమెరాల పనితీరు తదితర విషయాలపై డీఎస్పీ వాసుదేవన్‌తో చర్చించారు. అంతకుముందు ఎస్పీ మాధవరెడ్డి పెనుకొండ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలకు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల గురించి ఆరా తీశారు. కేంద్ర సాయుధ బలగాలకు (బీఎస్‌ఎఫ్) వసతి ఏర్పాట్లపై డీఎస్పీ బాజీజాన్‌సైదా, సీఐ యుగంధర్, ఎస్‌ఐ రాజేష్‌లను ఆరా తీశారు.

స్వేచ్ఛగా ఓటు వేయండి..
పెనుకొండ రూరల్: ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణాన్ని కల్పిస్తామని, ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం ఆయన పెనుకొండ మండలంలోని నాగళూరు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ గ్రామస్తులతో సమావేశమయ్యారు. ప్రశాంత ఎన్నికలకు ప్రజలందరూ సహకరించాలన్నారు.

బరిలో రెబల్స్!



టీడీపీ జెండాపై ఉన్న చంద్రబాబు చిత్రాన్ని చెప్పులతో కొడుతున్న మహిళా కార్యకర్తలు

- చివరి నిమిషంలో అభ్యర్థుల మార్పు
- ఆశావహుల తిరుగుబావుటా
- మడకశిరలో నామినేషన వేసిన ఈరన్న కుమారుడు సునీల్
- 'పురం' నుంచి నాగరాజు, పరిపూర్ణానందస్వామి
- నేడు నామినేషన్‌కు సిద్ధం

హిందూపురం అర్బన్/మడకశిర: నామినేషన్ల ఘట్టం ప్రారంభంకాగానే జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారింది. అభ్యర్థులను ఖరారు చేసి ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో పలు పార్టీలు బీఫాం మరొకరికి ఇచ్చాయి. దీంతో తామే అభ్యర్థులమంటూ ఇన్నాళ్లు ప్రచారం చేసుకున్న పలువురు నేతలు బీఫాం దక్కకపోవడంతో ఆయా పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్వతంత్రంగా బరిలో దిగి తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు.

టీడీపీ రెబల్‌గా సునీల్ నామినేషన్
చివరి నిమిషంలో మడకశిర టికెట్‌ను ఎంఎస్ రాజుకు ఇవ్వడంతో మాజీ ఎమ్మెల్యే ఈరన్న వర్గం చంద్రబాబుపై తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం ఈరన్న తనయుడు సునీల్‌కుమార్ వేలాదిమంది కార్యకర్తలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాన్ని ఆర్ గౌరీశంకర్‌రావుకు సమర్పించారు. అంతకుముందు పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న కార్యకర్తలు చంద్రబాబు, నారా లోకేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దళితుడైన సునీల్ నమ్మించి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు టీడీపీ జెండాలను చెప్పులతో కొట్టారు. మడకశిరలో టీడీపీని ఓడిస్తామని శపథం చేశారు. ఆ తర్వాత జరిగిన ర్యాలీలోనూ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంఎస్ రాజు గోబ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నాన్‌లోకల్ వద్దు... లోకలే ముద్దు అంటూ ర్యాలీ నిర్వహించారు.

మా అమ్మ, నాభార్య తాళి బొట్లు మాత్రమే మిగిలాయి
నామినేషన్ అనంతరం సునీల్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. టీడీపీపై ఉన్న నమ్మకంతో అప్పులు చేసి ఖర్చు చేశానని తెలిపారు. చివరకు తన తల్లి, భార్య తాళి బొట్లు తప్ప తన వద్ద ఇంకేమీ మిగల్లేదని తెలిపారు. 20 ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పని చేశామని, అందుకు చంద్రబాబు మంచి గుణపాఠం నేర్పారన్నారు. ఇది కౌరవులు, పాండవులకు జరుగుతున్న యుద్ధమని, చివరకు ధర్మమే గెలుస్తుందన్నారు. తాను టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీలో ఉంటానని, తాను లోకల్ అభ్యర్థి కావడంతో ప్రజలు తప్పకుండా గెలిపిస్తారన్నారు.

షర్మిలమ్మా... ఎక్కడమ్మా నీ మాట
కాంగ్రెస్ పార్టీ హిందూపురం అసెంబ్లీ అభ్యర్థిగా వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన నాగరాజును తొలుత ప్రకటించింది. సాక్షాత్తూ ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలోనే నాగరాజును అభ్యర్థిగా ఖరారు చేశారు. అయితే ఆ తర్వాత పట్టణానికి చెందిన వ్యాపారి ఎంహెచ్ ఇనయతుల్లాకు కాంగ్రెస్ బీఫాం ఇచ్చింది. దీంతో నాగరాజు పరిస్థితి గందరగోళంగా మారింది. తనను కాదని ఇనయతుల్లాకు బీఫాం ఎలా ఇస్తారని అధిష్టానాన్ని అడిగేందుకు ప్రయత్నిస్తే...కాంగ్రెస్ పెద్దలు ఎవరూ సమాధానం చెప్పలేదు. షర్మిలమ్మా...నువ్విచ్చిన మాట ఏమైందని అడిగితే ఆమె కూడా పట్టించుకోలేదు. దీంతో నాగరాజు కాంగ్రెస్ పార్టీకి తన సత్తా ఏమిటో చూపేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 24న హిందూపురం అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు.

ప్రజలకిచ్చిన మాట కోసమే పోటీ..
'బీజేపీ, టీడీపీ ఇచ్చిన మాట తప్పవచ్చు. స్వామీజీగా నేను హిందూపురం ప్రజలకు ఇచ్చిన మాట తప్పలేను...అందుకే హిందూపురం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నా.. 23న నామినేషన్ వేస్తున్నా' అని పరిపూర్ణానంద సోమవారం ప్రకటించారు. హిందూపురం ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు పరిపూర్ణానంద స్వామి సిద్ధమయ్యారు. బీజేపీ పెద్దల నుంచి హామీ తీసుకుని పార్లమెంట్ పరిధిలో ప్రచారం సైతం చేశారు. అయితే చివరి నిమిషంలో హిందూపురం సీటును పొత్తులో భాగంగా టీడీపీకి కేటాయించడం...బీకే పార్థసారథి బరిలో నిలిచారు. దీంతో పరిపూర్ణానందస్వామి టీడీపీ, బీజేపీ పెద్దలను కలిసి తనకు ఎంపీగా పోటీచేసే అవకాశం ఇవ్వాలని కోరారు. అయినా వారెవరూ ఆయన్ను పట్టించుకోలేదు. దీంతో ఆయన హిందూపురం అసెంబ్లీ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగేందుకు సిద్ధమయ్యారు. 'నేను ఇచ్చిన మాట తప్పితే కాషాయానికి విలువ ఉండదు. నేను నా తల్లి వద్ద ఏ సంకల్పమైతే చెప్పానో... ఆ సంకల్పాన్ని నెరవేరుస్తా.. నా తల్లి దీవెన హిందూపురం నియోజకవర్గ 2.46 లక్షల ఓటర్ల ఆశీస్సులు ఉన్నాయి' అని పరిపూర్ణానంద చెబుతున్నారు.

జోరుగా నామినేషన్లు

- సోమవారం 28 సెట్ల నామినేషన్లు దాఖలు
- పార్లమెంట్‌కు 5, అసెంబ్లీకి 23 నామినేషన్లు



వైఎస్సార్‌సీపీ కదిరి అభ్యర్థి మక్బూల్ తరఫున నామినేషన్ వేస్తున్న నాయకులు



వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి శాంత తరఫున నామినేషన్ వేస్తున్న నాయకులు

పుట్టపర్తి అర్బన్: నామినేషన్ల దాఖలు ఘట్టం జిల్లాలో జోరుగా సాగుతోంది. నాలుగో రోజు సోమవారం జిల్లాలోని ఒక పార్లమెంట్, 7 అసెంబ్లీ స్థానాలకు మొత్తం 28 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారులు తెలిపారు.

- హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థి జె.శాంత ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాలను కలెక్టర్ అరుణ్‌బాబుకు అందజేశారు.
- ఎంపీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పుట్టపర్తికి చెందిన రఘునాథరెడ్డి, భారత చైతన్య యువజన పార్టీ తరఫున ఆంజనేయులు 3 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. హిందూపురం పార్లమెంట్‌కు మొత్తం 5 నామినేషన్లు దాఖలయ్యాయి.
- రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గానికి బీఎస్పీ తరఫున అంజయ్య, స్వతంత్ర అభ్యర్థులుగా రవివర్మ, రాజేష్‌కుమార్ ఒక్కో సెట్ నామినేషన్లు వేశారు. ఆర్‌ఓ వసంత కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు.
- మడకశిర నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఈరలక్కప్ప ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థిగా ఎంఎస్ రాజు, స్వతంత్ర అభ్యర్థిగా సునీల్‌కుమార్, ధన్‌రాజ్, ఒక్కోసెట్ నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ గౌరీశంకర్‌కు సమర్పించారు.
- హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి బీఎస్పీ తరఫున శ్రీరాములు, స్వతంత్ర అభ్యర్థులుగా లోకేంద్రనాథ్, సుమలత, అనీల్‌కుమార్, వెంకటేష్‌రెడ్డి ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలు ఆర్‌ఓ జేసీ అభిషేక్ కుమార్‌కు అందజేశారు.
- పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గానికి బీఎస్పీ తరఫున ఆదినారాయణ నామినేషన్‌ను ఆర్‌ఓ అపూర్వ భరత్‌కు అందజేశారు.
- పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి బీఎస్పీ తరఫున అంపావతిని గోవిందు, స్వతంత్ర అభ్యర్థిగా అవుకు రఘునాథరెడ్డి రెండు సెట్లు, జై భారత్ నేషనల్ పార్టీ తరఫున బాలాజీ నాయక్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ భాగ్యరేఖకు అందజేశారు.
- ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా సూర్యనారాయణ నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ వెంకట శివరామిరెడ్డికి అందజేశారు.
- కదిరి అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థి మగ్బూల్, టీడీపీ తరఫున కందికుంట వెంకట ప్రసాద్, కందికుంట యశోదదేవి, కాంగ్రెస్ తరఫున షేక్ షానవాజ్, స్వతంత్ర అభ్యర్థిగా పాలకొండమ నాయుడు నామినేషన్ వేశారు.



సత్యసాయి మహాసమాధి(ఫైల్)



'మహానారాయణ సేవ'కు హిల్‌వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన టెంట్లు

సంకీర్తన.. సత్కర్మ

- నేటి నుంచి సత్యసాయి ఆరాధనోత్సవాలు
- వేడుకలకు ముస్తాబవుతున్న ప్రశాంతి నిలయం
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న కేరళ గవర్నర్
- 24న హిల్ వ్యూ స్టేడియంలో మహానారాయణసేవ
- దేశ విదేశాల నుంచి తరలి వస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: 'అందరినీ సేవించు.. అందరినీ ప్రేమించు' అంటూ ప్రపంచవ్యాప్తంగా భక్తులను పొందిన సత్యసాయిబాబా స్ఫూర్తిని సెంట్రల్ ట్రస్ట్ నేటికీ కొనసాగిస్తోంది. బాబా సూచన మేరకు ఏటా ఆరాధనోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తోంది. మహానారాయణ సేవ లాంటి సత్కర్మలతో పాటు సంకీర్తనలతో సత్యసాయిని కీర్తిస్తూ భక్తులకు ప్రేమ, సేవ పరమార్థాలను చాటుతోంది.

ముమ్మరంగా ఏర్పాట్లు..
సత్యసాయి ఆరాధనోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఏర్పాట్లు చేపట్టింది. దేశవిదేశాల నుంచి తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. వేడుకలకు వేదికైన ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన ఫల, పుష్ప, దళాలతో సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.


ఆరాధనోత్సవాల షెడ్యూల్ ఇలా..
సత్యసాయి ఆరాధనోత్సవాలు రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు.

- మంగళవారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత వేదపఠనంతో ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయి. 'ప్రేమ ఆరాధన' పేరుతో ప్రశాంతి భజన బృందం సంగీత కచేరీ నిర్వహించనుంది.
- 24వ తేదీ ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత వేద పఠనంతో వేడుకలు ప్రారంభమవుతాయి. సత్యసాయి విద్యార్థులు పంచరత్న కీర్తనల పేరుతో సత్యసాయికి తమ ఆత్మనివేదన చేస్తారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు ఎస్‌ఎస్ నాగానంద ప్రారంభ ఉపన్యాసం, సత్యసాయి సేవా సంస్థల దేశీయ అధ్యక్షుడు నిమిష్ పాండే ప్రసంగం ఉంటుంది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు, కేరళ గవర్నర్‌తో కలిసి శ్రీ సత్యసాయి దివ్యాంజన్, 'లిక్విడ్ లవ్' అన్న పేరుతో రూపొందించిన రెండు యాప్‌లను ఆవిష్కరిస్తారు. అనంతరం ముఖ్య అతిథి, కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ భక్తులనుద్దేశించి ప్రసంగిస్తారు. సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసురాలు నందినీరావు సంగీత విభావరి ఉంటుంది. అనంతరం మంగళ హారతితో వేడుకలు ముగుస్తాయి.

హిల్‌వ్యూ స్టేడియంలో మహానారాయణ సేవ...
సత్యసాయి ఆరాధనోత్సవాల్లో భాగంగా ఈ నెల 24న ఉదయం 10 గంటలకు సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మహానారాయణ సేవ చేపడుతోంది. ఇందుకోసం వారం రోజులుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సత్యసాయి భక్తులు మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 20 వేల మందికి సరిపడా తాత్కాలిక టెంట్లను ఏర్పాటు చేస్తున్నారు. నారాయణ సేవ కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్న ప్రసాదాలతో పాటు, నూతన వస్త్రాలను వితరణ చేయనున్నారు. ప్రశాంతి నిలయంలోని నారాయణ సేవకు సంబంధించిన ఆహార పదార్థాలను సిద్ధం చేస్తున్నారు.

క్లుప్తంగా

యువజన విభాగంలో కొత్తకోట చక్రధర్‌రెడ్డికి చోటు


చక్రధర్‌రెడ్డి

సాక్షి, పుట్టపర్తి: నియోజక వర్గానికి చెందిన కొత్త కోట సోమశేఖర్‌రెడ్డి తనయుడు కొత్తకోట చక్రధర్ రెడ్డి (చింతపంటి చక్రధర్ రెడ్డి) వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ యువజన విభాగం అదనపు జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కేటాయించిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

పుట్టపర్తి టౌన్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ అధికారులు సీజ్ చేశారు. సోమవారం పుట్టపర్తి మండలం పెడపల్లి ఆర్చ్ వద్ద సెబ్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సిబ్బంది రూట్ వాచ్ చేస్తుండగా మోటర్ బైక్‌పై తరలిస్తున్న రెండు అట్ట బాక్సుల్లో 96 హేవార్డ్స్, 288 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. మద్యం తరలిస్తున్న బుగ్గపల్లికి చెందిన బాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, కన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తూ పట్టుబడిన టీడీపీ నేత

రొద్దం: ఆర్.కుర్లపల్లికి చెందిన టీడీపీ నేత, వార్డు మెంబర్ బంజింగ ఈశ్వరప్ప సోమవారం పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. అనుమతులు లేకుండా తన సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రానికి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, జేసీబీలను స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వలిబాషా తెలిపారు.

ప్రజాక్షేత్రంలో గెలుపు జగనన్నదే

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి నాగలూరు వాసులు
- ధర్మవరం అరిగెల కుటుంబసభ్యులు, అనుచరులతో సహా 150 కుటుంబాల చేరిక


శివారెడ్డి, మంజునాథ్‌రెడ్డి, పోతలయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన 100 కుటుంబాలు


ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన పట్టణ ప్రముఖులు అరిగెల కుటుంబ సభ్యులతో పాటు 50కుటుంబాల వారు.

ధర్మవరం: ఒక్కడిని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలన్నీ పొత్తులతో ఏకమయ్యాయని, ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజాక్షేత్రంలో చివరికి గెలిచేది జగనన్నేనని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ధర్మవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు మట్టెద్దుల శివారెడ్డి, నాగలూరు మంజునాథ్‌రెడ్డి, పోతలయ్య ఆధ్వర్యంలో నాగలూరుకు చెందిన 100 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. పార్టీలోకి చేరిన వారిలో గంతిమర్రి లక్ష్మన్న, కాటమయ్య, నారాయణస్వామి, పెద్ద ఈరప్ప,తలారి నర్సింహులతో సహా 100 కుటుంబాల వారికి ఎమ్మెల్యే కేతిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైఎస్సార్‌సీపీలోకి అరిగెల ఫ్యామిలీ..

పట్టణ ప్రముఖులు సిద్ధార్థ, లక్ష్మీనారాయణ థియేటర్ల యజమాన్య సభ్యులు, బంధువర్గంలో ప్రధానంగా అరిగెల వెంకటేశ్, అరిగెల సురేష్, మహేష్, ప్రతాప్, హరిప్రసాద్, తొండమాల గుర్రప్పతో సహా 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ జనరంజక పాలన అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ఒక్క ధర్మవరం నియోజకవర్గంలో 94 శాతం మంది పేదలకు రూ.3,200 కోట్లు నిధులను జమ చేసి పేదవారి జీవనప్రమాణస్థాయిని పెంచారన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షులు నీలూరి ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, మండల కన్వీనర్ పోతుకుంట రామయ్య, సచివాలయాల కన్వీనర్ చందమూరినారాయణరెడ్డి, వార్డ్ ఇన్‌చార్జ్‌లు బడన్నపల్లి కేశవరెడ్డి, పోతుకుంట రామయ్య,పెద్దిరెడ్డిగారి శ్రీనివాసులు, కత్తెపెద్దన్న, తీర్థాల రమణ, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ గీడ్ జాన్తానై..

- టీడీపీ తరఫున వైకేపీ సీసీ ప్రచారం


టీడీపీ తరఫున ప్రచారంలో పాల్గొన్న వైకేపీ ఉద్యోగి రామాంజనేయులు (వృత్తంలోని వ్యక్తి)

కదిరి టౌన్: ప్రభుత్వ ఉద్యోగి ఒకరు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి.. రాజకీయ పార్టీ నాయకుడిగా అవతారమెత్తారు. గాండ్లపెంట మండలం కురుమామిడి గ్రామానికి చెందిన రామాంజనేయులు గోరంట్ల మండలంలో వైకేపీ సీసీగా పనిచేస్తున్నారు. టీడీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ తరఫున కురుమామిడి గ్రామంలో ఆ పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఓటర్లను కలిసి టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రభుత్వ ఉద్యోగి అయ్యుండి ప్రచారంలో పాల్గొనడంపై పలువురు ప్రస్తావిస్తే .. తాను టీడీపీకి ప్రచారం చేసేదే అంటూ కుండబద్దలు కొట్టారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



కొత్తచెరువు టీడీపీ, జనసేన నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి , వైఎస్సార్‌సీపీలో చేరిన నాగిరెడ్డిపల్లి, ఇరగంపల్లి, వంగంపల్లి వారితో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: కొత్తచెరువు మండలంలో టీడీపీ, జనసేన నుంచి 93 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం పుట్టపర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వీరందరికీ కండువాలు వేసి పార్టీలోకి చేరారు. కొత్తచెరువు జనసేన మండల ఉపాధ్యక్షుడు తుమ్మలకుంట నిజాం వలి, మండల కార్యదర్శి, బాలు, నరసింహా, చరణ్, గౌతమ్, సాయి, నిరంజన్, రాజు, భరత్, శివ, గోపి, శశాంక్, షౌకత్, ముస్కీన్, షేక్షా, బాబావుల్లా, వసీం ఆక్రమ్, మహీర్‌బాషా, ఇబ్రహీం, జనార్దన్, ఖాజా, రాఫీ, కుళ్లాయప్ప, బాషా, వీరన్న, షేక్షావలి, క్రాంతి తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు.

- నాగిరెడ్డిపల్లి, ఇరగంపల్లి, వంగంపల్లి నుంచి..

బొగ్గు రామాంజి, కురుబ రవి, కిష్టప్ప, గంగమ్మ, అజయ్, గంగోత్రి, తుమ్మల సురేంద్ర, కిష్టప్ప, జాల కిష్టప్ప, రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, కొండయ్య, రామదాసు, సాయికుమార్, విజయ్, శ్వేత, లక్ష్మమ్మ, కామాక్షి, రామచంద్ర, గంగప్ప, రాజప్ప, గుండ కిష్టప్ప, ఆంజనేయులు, సంజప్ప, పరమేశ్, మణేశ్వరీ, గంగమ్మ, సాదనపల్లి కామాక్షి నారాయణస్వామి, వరలక్ష్మమ్మ, ఆంజనేయులు, శ్రీరాములు, ఓబులమ్మ, తిరుపాలు, కొట్లపల్లి శ్రీరాములు,సంజమ్మ, రంగప్ప తదితరులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరంతా జెడ్పీటీసీ గంగాదేవి,మటన్ శంకర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో తలమర్ల సొసైటీ మాజీ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, దాల్ మిల్ సూరి తదితరులు పాల్గొన్నారు.

చల్లగ కరుణించే చౌడేశ్వరమ్మ

- నేటి నుంచి అమ్మవారి ఉత్సవాలు


చౌడేశ్వరి మూలవిరాట్

అమడగూరు: భక్తులను చల్లగ కరుణించే చౌడేశ్వరమ్మ ఉత్సవాలు అమడగూరులో మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఏటా చైత్రమాసాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ధర్మకర్త పొట్టా పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు, గ్రామ పెద్దలు, అమడగూరు, చీకిరేవులపల్లి, గుండువారిపల్లి గ్రామ పంచాయతీ ప్రజలు ఈ ఆలయంలో చౌడేశ్వరీ అమ్మవారి ఉత్సవాలను 8 రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. తొలిరోజు మంగళవారం కుంభకూడు, 24న ఉయ్యాలసేవ, 25న సూర్యప్రభ, 26న చంద్రప్రభ, 27న శ్రీ జ్యోతి, 28న అశ్వవాహనం, 29న సింహవాహనం, 30న హంసవాహన ఉత్సవాలు జరుగుతాయి.

టీడీపీ.. బ్రాహ్మణ వ్యతిరేకి

- రాష్ట్ర బ్రాహ్మణ సంఘం నాయకుడు జ్వాలాపురం శ్రీకాంత్


విలేకరులతో మాట్లాడుతున్న జ్వాలాపురం శ్రీకాంత్

ధర్మవరం: తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ వ్యతిరేకి అని, రాజకీయంగా, సంక్షేమ పరంగా తీరని అన్యాయం చేసిందని రాష్ట్ర బ్రాహ్మణ సంఘం నాయకుడు జ్వాలాపురం శ్రీకాంత్ ధ్వజమెత్తారు. దివంగత నేత వైఎస్సార్ నుంచి ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ వరకు బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారన్నారు. తమ సంపూర్ణ మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉంటుందన్నారు. సోమవారం ధర్మవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బ్రాహ్మణ సంఘం నాయకులు వెంకటేశ్వరప్రసాద్‌తో కలిసి జ్వాలాపురం శ్రీకాంత్ విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు బ్రాహ్మణుల పట్ల నిర్లక్ష్యభావం ఉందన్నారు. బ్రాహ్మణులు రాజకీయంగా ఎదగకుండా అణగదొక్కుతున్నారన్నారు. గత టీడీపీ పాలన మొత్తం చూస్తే మిరాశీ వ్యవస్థను తీసేయడం, ఆలయాల్లో అర్చకులు వంశపారంపర్యంగా కొనసాగకుండా అడ్డుకోవడం, ఆలయాల్లో ధూప దీప నైవేద్యం కింద అర్చకులకు ఇచ్చే వేతనాలు సక్రమంగా ఇవ్వకుండా చేయడం జరిగిందన్నారు. ఫలితంగా గత ఎన్నికల్లో బ్రాహ్మణుల ఆగ్రహంతో టీడీపీ చావుదెబ్బతిందన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆలయాల్లో అర్చకులకు ధూప దీప నైవేద్యం కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి ఆలయానికీ నిధులు కేటాయించారన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను బలోపేతం చేసి రూ.740 కోట్ల నిధులు ఖర్చు చేశారన్నారు. బ్రాహ్మణ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా బ్రాహ్మణులకు ఆర్థికంగా చేయూతనిచ్చారన్నారు. నవరత్నాల పథకాలలో సైతం లబ్ధి చేకూర్చామన్నారు. రాజకీయ 'ఉన్నతి'లో భాగంగా 2014ఎన్నికల్లో 1సీటు, 2019లో ముగ్గురికి బ్రాహ్మణులకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించారన్నారు. అంతేకాక స్థానిక సంస్థల్లోనూ బ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అందుకే బ్రాహ్మణ సంఘం తరఫున రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ధర్మవరంలో బ్రాహ్మణ వీధిలో ప్రచారం నిర్వహించామన్నారు. ఎమ్మెల్యేగా కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మళ్లీ గెలవాలని పిలుపునిచ్చారు. మద్దతు తెలిపాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి, సభ్యులు నారాయణస్వామి, తీర్థాల రమణ, రామారావు, శేషసాయి, భారత్‌కుమార్, ప్రణవ్‌సాయి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ముక్తాపురంలో టీడీపీకి భారీ షాక్


ముక్తాపురంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారు


ముత్తువకుంట్లలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన దృశ్యం

కనగానపల్లి: ముక్తాపురంలో ప్రతిపక్ష టీడీపీకి భారీ షాక్ తగలింది. 25 సంవత్సరాలుగా పరిటాల కుటుంబానికి దగ్గరగా ఉన్న ఇద్దరు మాజీ సర్పంచ్‌లతో పాటు మరో 65 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం సాయంత్రం గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో వీరంతా వైఎస్సార్‌సీపీ కండవాలు వేయించుకొన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్‌లు సూర్యశేఖర్‌రెడ్డి, దాసరి రామక్రిష్ణతో పాటు మల్లిరెడ్డి, నల్లపరెడ్డి, బోగం పోతలయ్య, నారాయణస్వామి, ఆదిశేషారెడ్డి, అంజిన్‌రెడ్డి, సాకే వెంకటరాముడు, దాసరి రామాంజినేయులు, హనుమంతరెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, చాకలి కొండమీదరాయుడు, మధుసూదన్‌రెడ్డి, వసంతకుమార్‌రెడ్డి, చాకలి వెంకటరాముడు, చాకలి క్రిష్ణమూర్తి, ఎస్.మంజునాథ్, మామిళ్లపల్లి కురుబ గోపాల్, నరసింహులు, జేసీబీ శీనా, నరసింహమూర్తి, సాకే నాగేంద్ర, వెట్టి కాశీమ్, గొర్ల నరసింహులు, కాటన్నగారి సుబ్బరాయుడు, కదిప్ప, చముర్తు ఓబిలేసు, హరిజన మస్తానప్పతో కలిపి దాదాపు 65 కుటుంబాలు ఉన్నాయి. వీరితో పాటు ముత్తువకుంట్లకు చెందిన మరో ఐదుగురు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, రమణారెడ్డి, కె.రామలింగారెడ్డి, సర్పంచ్ నారాయణ, వెంకనారాయణరెడ్డి, వెంకటనారప్ప, సూర్యనారాయణరెడ్డి, నాగిరెడ్డి, ఓబిలేసు, జనార్దన్‌రెడ్డి, నరసింహమూర్తి, సురేష్, సుధాకర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెండు రోజులు మద్యం బంద్

పుట్టపర్తి టౌన్: కర్ణాటకలో ఈనెల 26న జరగనున్న లోక్ సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లా సరిహద్దులో 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్న మద్యం దుకాణాలు బంద్ చేయాలని జిల్లా ఎక్సైజ్ అధికారి సహదేవ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశాల మేరకు సరిహద్దు కర్ణాటక రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడేందుకు, స్వేచ్ఛాయుత, ప్రశాంత పోలింగ్ నిర్వహించేందుకు రాష్ట్ర సరిహద్దులో ఉన్న మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలు, ఇతరత్రా ఎక్సైజ్ డిపార్టుమెంట్ నుంచి లైసెన్స్ పొందిన దుకాణాలు 48 గంటల పాటు అనగా 24వ తేదీ సాయంత్రం 5 నుంచి 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మూసివేస్తున్నట్లు తెలిపారు. మద్యం విక్రయదారులు, కొనుగోలుదారులు గమనించాలని కోరారు.

కనుల పండువగా రథోత్సవం

- రత్నగిరికి పోటెత్తిన భక్తులు
- మార్మోగిన మహాలక్ష్మీదేవి నామస్మరణ


భక్తజనసందోహం నడుమ కదులుతున్న రథం

రొళ్ల: చారిత్రక రత్నగిరి గ్రామంలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభంగా జరుగుతున్నాయి. సోమవారం అశేష భక్త జనసందోహం నడుమ బ్రహ్మ రథోత్సవం కనులపండువగా సాగింది. అమ్మవారి నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. తొలుత ఉదయాన్నే అమ్మవారి మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, తులసీపూజ చేసి మహామంగళహారతి ఇచ్చారు. ఆలయ ఆవరణ ముందు భాగాన రథాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు. రథం ముందు వేదపండితులు శాంతి, నవగ్రహ హోమం, యోగీశ్వరారధన, గణపతి పూజ చేశారు. తర్వాత ఉత్సవ విగ్రహాన్ని అర్చకులు పూలతో అలంకరించుకుని మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయ ప్రాంగణం, రథం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చారు. మహాలక్ష్మి అమ్మవారి నామస్మరణతో భక్తులు రథాన్ని ఆలయ ప్రాంగణం నుంచి ప్రధాన రోడ్డు వరకు లాగారు. గ్రామానికి చెందిన బ్రాహ్మణ కులస్తులు రాజవంశీకులతో కలిసి అమ్మవారికి జ్యోతులతో ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణలు చేసి సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానంతో పాటు పెసరబ్యాళ్లు, మజ్జిగ, తీర్థప్రసాదం అందజేశారు.

నేడు గంగ పూజోత్సవం

కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం అమ్మవారికి గంగ పూజోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

యువకుడి ఆత్మహత్య

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎల్2 కేతిరెడ్డికాలనీ సమీపంలో సోమవారం రైలుకిందపడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు హిందూపురం రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి ఎత్తు ఐదు అడుగులు, ఎరుపు రంగు శరీరం, వయసు 30 – 35 ఏళ్లమధ్య ఉంటుందని పేర్కొన్నారు. నలుపురంగు రౌండ్‌నెక్ బనియన్, ఆరెంజ్ కలర్ డ్రాయర్, గ్రీన్ కలర్ షార్ట్ వేసుకుని ఉన్నాడని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 94412 38182, 94406 27641 నంబర్లలో రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు. పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

ఆరోగ్యశ్రీ అనుసంధానం పేరిట రూ.60వేలు స్వాహా

చిలమత్తూరు: ఆరోగ్యశ్రీ అనుసంధానం చేస్తానని జ్యోతి అనే మహిళ బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాడు రూ.60 వేలు కాజేశాడు. బాధితురాలు సోమవారం చిలమత్తూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారం తనకు ఒకరు ఫోన్ చేసి ఆరోగ్యశ్రీ అనుసంధానం కోసమంటూ వివరాలు అడిగారని, ఆ తర్వాత యూపీఐ ద్వారా నగదు బదిలీ చేసుకున్నారని తెలిపారు. ఎస్‌ఐ గంగాధర్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత, బ్యాంక్ ఖాతా వివరాలను ఇవ్వకూడదన్నారు.

అప్పట్లో అభ్యర్థికో ఇనుపపెట్టె



మీకు తెలుసా?

పుట్టపర్తి టౌన్: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో నేడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు వినియోగిస్తున్నారు. ఒకప్పుడైతే అభ్యర్థికో ఇనుప పెట్టె వాడేవారు. 1952, 1957 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ప్రత్యేకంగా ఇనుప పెట్టెలను బ్యాలెట్ బాక్సులుగా ఏర్పాటు చేశారు. ఓటర్లు విధిగా అభ్యర్థికి కేటాయించిన పెట్టెల్లోనే ఓటు వేయాల్సి ఉండేది. సంస్కరణల్లో భాగంగా 1962లో నిర్వహించిన ఎన్నికల్లో పోలింగ్ బూత్‌కు ఒక పెట్టె ఏర్పాటు చేశారు. బూత్‌లోని ఓట్ల సంఖ్య అధారంగా ఇనుప పెట్టెను గోనే సంచుల్లో తీసుకొని వాహనాల్లో కేటాయించిన గ్రామాలకు వెళ్లేవారు. కాలక్రమేణా ఎలక్ట్రానిక్ యంత్రాల వినియోగం ఆరంభం కావడంతో ఓటింగ్‌లో సమూల మార్పులు చోటు చేసుకొన్నాయి. దీంతో ఓటింగ్‌లో అక్రమాలకు తెరపడింది.

దాడి కేసులో ఏడాది జైలు

కదిరి అర్బన్: దాడి కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష పడింది. వివరాల్లోకెళ్తే.. కదిరి మండలం చెవిటితండాలో 2016 సంవత్సరంలో స్థలం విషయమై రమేష్‌నాయక్, తానేబాయ్‌లను యుగంధర్ నాయక్ అనే వ్యక్తి కట్టెతో కొట్టి గాయపరిచాడు. అప్పట్లో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేశారు. ఈ కేసులో యుగంధర్ నాయక్‌పై నేరం నిర్ధారణ కావడంతో జేఎఫ్‌సీఎమ్ కోర్టు ఏడాది జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధించినట్లు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ సోమవారం తెలిపారు.

ఆరోగ్య సేవల్లో ఎంఎల్‌హెచ్‌పీ పాత్ర కీలకం

ప్రశాంతి నిలయం: క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవలు అందించడంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల (ఎంఎల్‌హెచ్‌పీ) పాత్ర ఎంతో కీలకమైనదని డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీలు స్త్రీ, శిశు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలన్నారు. సోమవారం ప్రశాంతి గ్రాంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కేర్ క్యాంపెనియన్ కార్యక్రమంపై మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు శిక్షణ ప్రారంభమైంది. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బాలింతలు, గర్భిణులు, పిల్లలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ కుళ్లాయప్ప నాయక్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ నాగరాజు, ఫ్యామిలీ ప్లానింగ్ ఫిజిషియన్ డాక్టర్ రవి, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మాధుర్య తదితరులు పాల్గొన్నారు.